## బిజేపి రాష్ట్ర ఆధ్యక్షుని సమావేశాన్ని జయప్రదం చేయండి



**కావలిరూరల్,ఆగష్టు5ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఈ నెల 13వ తేది నెల్లూరు పర్యటనను విజయవంతం చేయాలని కావలి బిజేపి నాయకులు కోరారు. రాష్ట్ర ఆధ్యక్షుని నెల్లూరు పర్యటన సన్నాహ సమావేశం జిల్లా ట్రేజరర్ సివిసి సత్యం, ప్రధాన కార్యదర్శి బెల్లంకోండ మాల్యాద్రీ ఆధ్వర్యంలో కావలిలోని నమస్కార్ హోటల్లో నియోజకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా ఆధ్యక్షుడు శ్రీపారెడ్డి వంశీధర్ రెడ్డి పాల్గోని కావలి రెండవ పట్టణ అధ్యక్షులుగా లక్కరాజు బాస్కర్‌ను నియామకం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యానారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి. భరత్ కుమార్ యాదవ్, కమల, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు రంగారెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షురాలు పి. మాధవి, రాష్ట్ర మోర్చా భాద్యులు మురళీ నాయుడు, పరుసు వెంకటేశ్వర్లు, లక్ష్మీ ప్రసన్న మండల అధ్యక్షులు మందా కిరణ్, ఏ.క్రిష్ణ మోహన్, జై కుమార్, వి. శ్రీనివాసులు, కమ్మ శ్రీనివాసులు సీనియర్ నాయకులు చిట్టి బాబు, బ్రహ్మానందం, సన్నిగంటి శీనయ్య, మద్దిశెట్టి నరేంద్ర, రమణా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు, క్రీయాశీలక సభ్యులు పాల్గోన్నారు.

## బుచ్చిలో ఘనంగా బెజవాడ గోపాల్‌రెడ్డి జయంతి



**బుచ్చి ఆగష్టు 5 ప్రభాతవార్త :** ఎఐసిసి పిలుపు మేరకు నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డిఆదేశాలతో కోవూరు నియెజకవర్గం ఇన్‌చార్జి ఏటూరు శ్రీనివాసులురెడ్డి సూచనలతో మంగళవారం ఉత్తరప్రదేశ మాజీ గవర్నర్ ప్రముఖ స్వాతంత్ర్యోద్యమ కారులు దివంగత నేత బెజవాడ గోపాల్‌రెడ్డి జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన దేశానికి ఎంతో సేవ చేశారని నాయకులు కోనియాడారు.ఈ కార్యక్రమంలో భాగంగా బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాలెం మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కిషోర్, దాసరి హజరత్తయ్య, దార్ల రామయ్య, మైనార్టీనాయకులు బషీర్, ఆత్మకూరు వెంకటేశ్వర్లు, పెంచలయ్య, సతీష్,సాయిబాబా పాల్గోన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ఉదయగిరి, ఆగష్టు 5, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని వరికుంటపాడు మండల పరిధిలో గల తిమ్మారెడ్డిపల్లి వద్ద గత రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. శ్రీశైలం నుండి నెల్లూరు కు వ్యాగనార్ కారులో వస్తుండగా భోజనం చేసేందుకు తిమ్మారెడ్డిపల్లి వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో దుత్తలూరు నుండి ఒంగోలుకు వెళ్తున్న నల్లరంగు కలిగిన కియా కారు ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నెల్లూరు పద్మావతి సెంటర్‌కు చెందిన రాజేంద్ర వ్యక్తి మృతి చెందారు. పోస్టుమార్టం కోసం ఉదయగిరి మార్చ్యురిలో ఉంచారు. రాజేంద్ర మృతదేహాన్ని 9గంటలకు అప్పచెప్పారని తెలిపారు. అతి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి పరిశీలిస్తున్నారు.

## ముర్రుపాలుతో వ్యాధి నిరోదక శక్తి



**చేజర్ల ఆగష్టు 5 ప్రభాతవార్త :** ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి అదికంగా ఉంటుందని పుట్టి న బిడ్డకు గంట లోపు ముర్రుపాలు పడితే మొదటి టీకాలా పనిచేస్తుందని తద్వారా వ్యాధులు ప్రబలకుండా బిడ్డకు వ్యాధి నిరోదక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ఎం పద్మ తెలియజేశారు. మండల కేంద్రమైన చేజర్ల అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్స వాలు ఘనంగా నిర్వహిం చారు.అనంతరం ఆమె మాట్లాడుతు తల్లిపాలు బిడ్డకు కనీసం 6 నెలలు పాటు తప్పకుండా ఇవ్వాలని సూచించారు.6 నెలల తరువాత అనుభంధ ఆహారాలను ఇచ్చే విధంగా చూడాలన్నారు. ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందని అన్నారు. తల్లి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు.తల్లిపాల ప్రామఖ్యత గురించి వివరించారు.ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు,ఎఎన్ఎంలు, ఆశాలు,తదితరులు పాల్గోన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు స్వీకరణ - సీడీపీఓ పద్మజ కుమారి



**వింజమూరు, ఆగష్టు 5, ప్రభాతవార్త :** వింజమూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కలిగిరి కొండాపురం జలదంకి వింజమూరు మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీఓ పద్మజా కుమారి తెలిపారు. వింజమూరు ప్రాజెక్టు పరిధిలో 11 అంగన్‌వాడీ కార్యకర్తలు 12 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. వింజమూరు మండలం రావిపాడు అంగన్‌వాడీ(ఓసీ) వింజమూరు బీసీ కాలనీ(బీసీఏ), కలిగిరి మండలం వీర్నకోలుమెయిన్(ఓసీ), కలిగిరి మండలం తెల్లపాడు మెయిన్(ఓసీ), సిద్దన కొండూరు (మిట్టపాలెం)(ఓసీ), జలదంకి మండలం అన్నవరం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ(ఎస్టీ), జలదంకి మండలం నెహ్రూ నగర్ అంగన్‌వాడీ(ఎస్టీ), జలదంకి మండలం తిమ్మసముద్రం అంగన్‌వాడీ(ఎస్టీ), కొండాపురం మండలం కొండాపురం మెయిన్(బీసీఏ), కొండాపురం మండలం వెంకటరంగాపురం(బీసీ ఈ), కొండాపురం మండలం గొట్టిగుండాల మెయిన్-2 (ఓసీ), అంగన్‌వాడీ సహాయకుల కేంద్రాల ఖాళీల కలిగిరి మండలం కొత్తూరు(ఓసీ) వీర్న కళ్ళు(ఓసీ), చాకల కొండ బీసీ కాలనీ(బీసీ ఏ), వింజమూరు వివర్స్ కాలనీ(బీసీ బి), పాతూరు (ఓసీ), నల్లగొండ ఎస్టీ మాధవ్ నగర్(ఎస్టీ), జలదంకి మండలం ఆదిరెడ్డి పాలెం మెయిన్(ఓసీ), జలదంకి మండలం కొత్తపాలెం(ఎస్టీ), కొండాపురం మండలం కొమ్మిమెయిన్ సెంటర్(బీసీ డీ), కుంకుమవారిపాలెం(ఓసీ) ఆది మూర్తి పురం మెయిన్ 2 ఎస్సీ కేటగిరి పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ సీహెచ్ పద్మజాకుమారి తెలిపారు. 01-07-2025 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు ఉండాలని, స్థానిక వివాహిత మహిళ అయి ఉండాలని, అవివాహితులు అనర్హులు. పోస్టులు ఎంపిక పక్రియ ప్రభుత్వ ఉత్తుర్వులు మేరకు జరుగుతాయన్నారు. ఐదో తేదీ నుండి 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఉద్యోగాలకు అర్హతలు.. పదో తరగతి పాస్ అయి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ హ్యాబిటేషన్‌లోని పోస్టులకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్ధులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ కేటగిరిలో పదవ తరగతి పాస్ కాబడిన వారు ఎవరు లేనియెడల తదుపరి తరగతుల వారు అర్హులన్నారు(8వ తరగతి పాస్ కూడా పరిగణలోకి తీసుకోబడుతుందని తెలిపారు. కావున అర్హత కలిగిన అభ్యర్ధులు ఈనెల 26వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

## నేడు అన్నా క్యాంటీన్‌కు ఎమ్మెల్యేచే శంకుస్థాపన



**ముత్తుకూరు, ఆగష్టు 5, ప్రభాతవార్త :** సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఈ నెల 6వ తేది బుధవారం అన్నా క్యాంటీన్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. ఈ శంకుస్థాపనకు సంబంధించి స్థానిక అధికారులతో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బొలిగర్ల శ్రీనివాసులు, పంచాయితీ కార్యదర్శి శిఖామణి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో ఎస్సీ,ఎస్టీ డివిజన్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం



**ఆత్మకూరు , ఆగస్ట్5,ప్రభాతవార్త :** ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఆర్‌డిఒ పావని అధ్యక్షతన మంగళవారం ఎస్సీ,ఎస్టీ డివిజన్ స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి డివిజన్‌లో తహసిల్దార్లు, ఎంపిడిఒలు, పోలీసు అధికారులు, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, ఇరిగేషన్, పబ్లిక్‌హెల్త్, విద్యుత్ శాఖ అధికారులు, కమిటీ సభ్యులు సిద్ధం పెంచలనరసయ్య, యర్రగుంట పెంచలయ్య లు హాజరయ్యారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు చెందిన ప్రజలకు సంబంధించిన సమస్యలు వాటి పరిష్కార చర్యలు, వివిధ శాఖల నుండి వారి జీవనానికి , పురోగతికి అందించబడుతున్న పథకాల గురించి చర్చించారు. సాయంత్రం 4.30నుండి 5.15గంటల వరకు మాన్యువల్ స్కావెంజర్ల నియామక నిషేధం, వారి పునరావాస చట్టం అమలుకు సంబంధించిన డివిజన్ స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, ఆత్మకూరు , డివిజన్‌లోని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు,ఎంపిడిఒలు, పోలీసు అధికారులు, సహాయ సాంఘిక సంక్షేమాధికారులు, ఇరిగేషన్ , పబ్లిక్‌హెల్త్, విద్యుత్ శాఖ అధికారులు హాజరయ్యారు.

# వీఆర్ హైస్కూల్ పనులకు సంబంధించి కమీషనర్‌కు లేఖరాయడం మంచి పద్దతి కాదు - ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి,



**మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌పై హాట్ కామెంట్స్:** వాస్తవంగా అనిల్ కుమార్ యాదవ్ గురించి మాట్లాడాలంటే ఇబ్బందికరంగాను ఎందుకు ఈ మాట అనాల్సి వస్తుందంటే నెల్లూరు జిల్లా నుంచి నెల్లూరు జిల్ల ప్రజలు కావచ్చు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత అయినటువంటి జగన్‌మోహన్‌రెడ్డి కావచ్చు జిల్లాలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇతర నాయకులు కావచ్చు కట్టగట్టి నీకు దండం మహాప్రభో నువ్వు వద్దు ఈ జిల్లాకి అని తరిమేస్తే పల్నాడులో పడి పల్నాడు ను నాశనం చేసి ఎన్నికల్లో ఓటమి తర్వాత సంవత్సరం పాటు అజ్ఞాతవాసంలో ఉండి నీ కోసం పని చేసిన కార్యకర్త బతికున్నాడా చచ్చాడా అనేది కూడా లేకుండా వ్యక్తిగత వ్యాపారాలు చేసుకుంటూ సంవత్సరం తర్వాత తగుదినమ్మ అంటూ జిల్లాకి వచ్చి నాలుగైదు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టి కొత్తగా ఇప్పుడు బీసీ రాగం ఎత్తుకున్నాడని ఈ సందర్భంగా పాత్రికేయ మిత్రుల ద్వారా నేరుగా అనిల్ కుమార్ యాదవ్‌కి ఆయనకి మద్దతు తెలుపుతున్న కార్యకర్తలకు గానీ ఒకటే చెబుతున్న ఈ రోజు నీకు బీసీలు గుర్తు వచ్చారా అని అడుగుతున్నాను. నీకు 2009లో శాసనసభ్యుడిగా టికెట్ వచ్చి న, 2014 లో శాసనసభ్యుడుగా గెలుపొందిన, 2019లో మంత్రి పదవి దక్కించుకున్న కేవలం అనిల్ కుమార్ యాదవ్ అని ఉండబట్టి అది ఈ రోజు మీకు గుర్తుకొచ్చిందా అని అడుగుతున్నాను అన్నారు.

❖ నెల్లూరు జిల్లాలో మిగతా బీసీ కులాలు పక్కనపెడితే ఒక్క ఉదాహరణ మీ ద్వారా నెల్లూరు ప్రజలకు తెలియజేయాలనుకున్న మరి ముఖ్యంగా మా బీసీ సోదరులకు నెల్లూరు జిల్లాలో యాదవులకు ఒక్క భవనం కూడా లేదు ఒక్క యాదవ భవనం కట్టుకుంటాం పార్టీలకు అతీతంగా అని యాదవ కుల పెద్దలందరూ నీ దగ్గరికి వస్తే ఒక్క రూపాయి కూడా నీ ద్వారా ఇచ్చావా అని అడుగుతున్నాను అన్నారు. కనీసం మాట సహాయం అయినా చేశా అని అన్నారు. నీ అవసరానికి ఇప్పుడు బీసీలు గుర్తుకు వచ్చారా.

❖ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురించి ఏదైనా మాట్లాడితే నేను పెద్ద నాయకుడైన అయిపోతానని, మర్చిపోయిన, నెల్లూరు జిల్లా ప్రజలు మళ్లీ నేనొక్కడిని ఉన్నాను అని గుర్తు చేసుకుంటారని, లేనిపోనివి మాట్లాడటం తప్ప కుట్రలు కుతంత్రాలు ఏమి తెలియని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురించి కేవలం తన కష్టార్జితంతో కష్టపడి సంపాదించిన డబ్బుతో తనకు జన్మనిచ్చిన నెల్లూరు జిల్లాకు ఎంతో కొంత సేవా చేయాలన్న ఆలోచన కోసం తపన పడే ప్రభాకర్‌రెడ్డి గురించి మాట్లాడితే మగతనం అవుతుంది అనుకుంటే మాత్రం నీ భ్రమ అని అన్నారు.

❖ బీసీ నాయకుడ్ని కాబట్టి నన్ను ఆరు గంటలకు కూర్చోబెట్టారు నువ్వు లోపల ఏ విధమైన సమాధానాలు చెప్పావో ప్రసన్న కుమార్‌రెడ్డి మూడు గంటలకు వచ్చారు, నేను బీసీని కాబట్టి నన్ను ఆరు గంటలకు కూర్చోబెట్టారని శునకానందం పొందడం జరిగిందన్నారు.

❖ అనిల్ కుమార్ యాదవ్ మీ జీవానికి కొంత మంది ఊరు వదిలి వెళ్ళిపోయారు అని అన్నారు.

- నీ సొంత పీఏ పెయ్యాల నాగరాజుకి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ ఏమిటా అని ఆరాధిస్తే దేశమే వదిలి వెళ్లిపోయాడని మరి ఎందుకు వెళ్లాడో ఏమి సునకానందం పొందితే పోయాడో మాకైతే తెలియట్లేదు అన్నారు.

❖ అనిల్ కుమార్ యాదవ్ నిన్ను ఆరు గంటల పాటు కూర్చోబెట్టాల్సిన అవసరం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, వారి సతీమణి ప్రశాంతికి అవసరమే లేదన్నారు. నిజంగా వారు నిన్ను ఇబ్బంది పెట్టాలనుకుంటే జిల్లాలో అందరికి టార్గెట్ అనిల్ అని ఈయన ఏందో అని సంబోధించారు.

❖ అసలు నీకు తాడు బొంగరం లేదు. నియోజకవర్గం లేదు. కేరాఫ్ అడ్రస్ లేదు, నీ మీద ఎందుకు టార్గెట్ ఉంటుందని అడుగుతున్నాను అన్నారు. నీ గురించి నువ్వు ఊహించుకోవడం ఉత్తర కుమార మాటలు తప్ప ఇంకా ఏమి లేదు అని అన్నారు.

❖ పాపం నేను తయారు చేసిన అనీలే నా అని ఒక్కో సారి బాధ కలుగుతుందన్నారు. ఒక్కో సారి జాలి వేస్తుంది అన్నారు.

- పోలీసు విచారణకి ఎక్కడెక్కడి నుంచో రండి రండి అని పల్నాడు నుంచి కూడా మా సామాజిక వర్గానికి సంబంధించిన కొంత మంది పిచ్చోళ్లకి కూడా ఫోన్ చేసి అదేదో బల ప్రదర్శన లాగా పిలిపించుకోవడం జరిగిందన్నారు.

❖ నీ కేంటే మందు మాజీ శాసనసభ్యులు మాజీ మంత్రి అందరూ పోయి వచ్చారు హైకోర్టు డైరెక్షన్ తో పోలీసు విచారణకు పిలిచాడు. ప్రసన్న కుమార్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయిస్తే హైకోర్టు చివాట్లు పెట్టి డైరెక్షన్ ఇచ్చిందన్నారు. నెల్లూరు జిల్లా జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమానికి నాకు శక్తి లేదు అని ఆనం విజయకుమార్‌రెడ్డి చెప్తే నేను పది లక్షలు ఇచ్చాను ఇది అనిల్ కుమార్ యాదవ్ యొక్క వ్యక్తిత్వం. ఇలాంటి విషయాలు బయటకి చెప్పొచ్చా అని అడుగుతున్నానన్నారు.

❖ ఏ రోజైనా ఇప్పటి వరకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నోట్లోంచి అనిల్ కుమార్ యాదవ్ పేరు ఉచ్చరించారా ఎప్పుడైనా అనిల్ ఎన్ని సార్లు లబ్ది పొంది ఉంటావు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దగ్గర విశ్వాసం అనేది ఉండాలన్నారు. కడుపుకి అన్నం తింటుంటే లబ్ది పొంది ఉంటే ఎవరి దగ్గరైనా సహాయం పొందితే విశ్వాసం అనేది ఉండాలన్నారు.

❖ రాజకీయ అరంగేట్రం చేసిన రోజు నుంచి వేలు పెట్టి నడిపించిన వ్యక్తిగా అందరూ అనుకుంటారేమో మంత్రి పదవి పోయిన తర్వాత రూప్ కుమార్ విభేధించి బయటకు వచ్చాడని పాత్రికేయ మిత్రుల ద్వారా ప్రజలకి, ఆ విధంగా భావించే వాళ్ళకి తెలియజేస్తున్న అనిల్ మంత్రిగా ఉన్నప్పుడే నేను విభజించి బయటకు వచ్చాను అన్నారు. 20222 జనవరి 4 వ తేదీన అప్పటికి అనిల్ కుమార్ యాదవ్ జలవనరుల శాఖ మంత్రి చాలా మంది అనుకుంటారేమో అధికారం పోయిన తర్వాత రూప్ కుమార్ యాదవ్ బయటకి పోయాడేమోనని ఈ అనిల్ కుమార్ యాదవ్ నిజ స్వరూపం అధికారం వచ్చిన ఆరు నెలలకే తెలుసుకున్నానన్నారు. సహజంగా నేను మనిషిని అంచాన వేయడంలో నేను పెద్ద సంగతినిఫీలింగ్ ఉండేది నాకు అది తప్పు అని నిరూపించాడు మా అనిల్ కుమార్ యాదవ్. అధికారం వచ్చి, అధికారం మదం తలకెక్కిన తర్వాత ఆరు నెలలకే తెలుసుకొని తగ్గుతాడు మారుతాడని చూసి మంత్రిగా ఉన్నప్పుడే బయటకి వచ్చాను అన్నారు.

**మైనింగ్ గురించి హాట్ కామెంట్స్:** వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్పష్టంగా గత వారం మీడియా సమావేశంలో చెప్పారు అనిల్ కుమార్ యాదవ్ గత సంవత్సరం 90 కంపెనీలు లక్ష 67 వేల టన్నుల ఎగుమతులు జరిగితే అందులో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఏదైతే ఫ్యాక్టరీ కొరకు పెట్టిన కంపెనీ ఫిని క్యాడ్జ్ కావచ్చు లక్ష్మీ క్యాడ్జ్ కావచ్చు కేవలం 19 వేల 600 టన్నులు మాత్రమే అని అన్నారు.

❖ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మొన్న స్పష్టంగా చెప్పారు. నేనేదో మంచి చేయాలా అనే ఆలోచనతో భారతదేశంలోనే ఇప్పటి వరకు లేనటువంటి హై ప్యూరిటీ క్యాడ్జ్ సాండ్ ఏదైతే సెమీ కండక్టర్లకి, సోలార్ క్రూజ్ హౌస్‌కి వాడతారో భావి భవిష్యత్తు అంతా కూడా అది ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కావచ్చు సోలార్ ఎనర్జీ కావచ్చు వీటన్నింటికి కావాల్సినటువంటి ఏదైతే ఈ హ ప్యూరిటీ క్యాడ్జ్ సాండ్ ఉందో మన దగ్గర దొరికేటువంటి ముడి సరుకుని చైనా వాళ్ల తీసుకొని అక్కడ శుద్ధి చేసి మరలా తిరిగి మనకే అమ్ముతున్నారు. అలా కాకుండా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంచి ఆలోచన చేసి మనమే మేక్ ఇన్ ఇండియా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనల మేరకు వందల కోట్ల వ్యయం చేసి ఆ ఫ్యాక్టరీ తానే పెట్టాలని ప్రభుత్వ పెద్దల అనుమతితో ఒక మంచి ఫ్యాక్టరీ పెట్టి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్రానికి రెవెన్యూ జనరేట్ చేయాలని ఒక మంచి ఆలోచనతో ఎవరు చేయలేనటువంటి సాహసం భారతదేశంలోనే ఆధోని పెట్టలేదు, రిలయన్స్ అంబానీ పెట్టలేదు, టాటా వాళ్లు పెట్టలేకపోయారంటే చైనావాడు ఆ టెక్నాలజీని ఇవ్వలేదు కాబట్టి. ఎలాగైనా మన దగ్గర మంచి ముడిసరుకు దొరుకుతుందనే ఉద్దేశంతో ఫ్యాక్టరీ పెట్టి పది మందికి ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో మంచి ఆలోచన చేసి వందల కోట్ల వ్యయం పెట్టి చేయాలనుకుంటే అనవసరంగా పనికి మాలిన వెదవలు ఆయన గురించి అవాకులు చవాకులు మాట్లాడటం సమంజసం కాదన్నారు.

## ఆత్మకూరులో జర్నలిస్టుల కోర్కెల దినోత్సవం



**ఆత్మకూరు, ఆగస్ట్5,ప్రభాతవార్త :** ఆత్మకూరులో జర్నలిస్టుల కోర్కెల దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఎపిడబ్ల్యుజె ఆంధ్రప్రదేశ్ యూని యన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా కమిటీ పిలుపు మేరకు ఎపిడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహి ంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రభుత్వం కూడా జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కరించడం కానీ, కోర్కెలను ఆమోదించడం కానీ చేయలేదన్నారు. సమాజంలో జర్నలిస్టులుగా ఉన్నవారు ప్రజలే , ఓటర్లేనని కానీ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసే ప్రభుత్వాలు తమ గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అక్రిడేషన్ జిఒ విడుదల చేయాలని, హెల్త్ స్కీమ్ సక్రమంగా అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, జర్నలిస్టులకు ఇంటినివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ బి.పావనికి వినతిపత్రం అందజేసి తమ సమస్యలను ప్రభుత్వానికి విన్నవించాలని, తమకు ఆత్మకూరులో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. స్పందించిన ఆర్‌డిఒ పావని స్థలం కేటాయింపుకు తాను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎపిడబ్ల్యుజె జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.రమణారెడ్డి, బి.వెంకటేశ్వర్లు, సి.హెచ్.వి.సుబ్బారావు, రహమత్ అలీ, సీనియర్ జర్నలిస్టులు చిట్టెం శ్రీనివాసులు, చాంద్‌బాషా, కరిముల్లా, మూర్తి, ఆత్మకూరు పట్టణ, నియోజకవర్గంలోని ఆత్మకూరు, ఏఎస్‌పేట, సంగం, మర్రిపాడు, అనంతసాగరం, చేజర్ల మండలాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ , యూట్యూబ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణను నిలుపుదల చేయాలి



**కావలిరూరల్,ఆగష్టు5,ప్రభాతవార్తః** కావలి రూరల్ మండలం ఆనెమడుగు గ్రామంలో బలవంతపు భూసేకరణను నిలుపుదల చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్‌చేశారు .ఆనెమడుగు గ్రామంలో బలవంతపు భూసేకరణ బిపిసిఎల్ కంపినీకి కేటాయిస్తున్నారు.అందులో భాగంగ మంగళవారం భూసేకరణకు అవార్డు ప్రకటించేందుకు నోటీసులు జారీచేస్తే దానికి హాజరుకమ్మని అక్కడి ప్రజల్ని కోరారు.సబ్‌కలెక్టర్ అర్జీదారులతో మాట్లాడారు.అర్జీదారులు మేము బలవంతపు భూసేకరణకు బిపిసిఎల్ కంపెనీకి భూములివ్వమని చెప్పారు.ఈసందర్భంగ ఆనెమడుగు గ్రామ ప్రజలు బిపిసిఎల్ కంపెనీకి భూములను బలవంతంగ తీసుకోవద్దని కోరుతు కావలి ల్యాండ్ అక్విడేషన్ సబ్‌కలెక్టర్ కె రాజశేఖర్‌కు వినతిపత్రం ఇచ్చారు.భూములు ఇస్తే మాబ్రతుకుదెరువు పోతుందని ఎట్టిపరిస్తితులలో భూములు తీసుకోవద్దని సబకలెక్టర్ ముందు ఆందోళనవ్యక్తంచేశారు. ఈ కర్యాక్రమంలో ఆనెమడుగు గ్రామస్తులు జయరామిరెడ్డి, వెంకట్రావ్,ం ్వీంద్ర,మాధవ్‌రావు,మరియు గ్రామస్తులు మరియు వ్యవసాయకార్మికసంఘం రాష్ట్ర కమిటి సభ్యుడు తాళ్ళూరు మాల్యాద్రి,కావలి మండలం కార్యదర్శి రాధా కృష్ణయ్యలు పాల్గొన్నారు.

## వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ కార్యలయం వద్ద ధర్నా



**కావలిరూరల్,ఆగష్టు5ప్రభాతవార్త :** రాష్ట్ర వామపక్ష పార్టీల పిలుపు మేరకు స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించవద్దని ట్రూ ఆప్ చార్జీలు పేరుతో పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని కోరుతూ మంగళవారం కావలి విద్యుత్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కార్యలయం వద్ద ధర్నా నిర్వహించి కె.ఎస్ బెనర్జికి వినతి పత్రం అందింజేశారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ, సిపిఐఎల్ పార్టీ నాయకులు పసుపులేటి పెంచలయ్య, డి. దుర్గా బాబు, ఎల్. లక్ష్మా రెడ్డి,లు మాట్లాడుతూ ఆదాని స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించి ప్రజల వద్ద నుండి కరెంటు చార్జీల పేరుతో ఎక్కువ డబ్బులు గుంజి ఆదానికి లాభాలు చేకూర్చడమే రాష్ట ప్రభుత్వం పనిగా వుందని, ఇప్పటికే కరెంటు చార్జీలు భారాలు ప్రజలపై ప్రభుత్వం మోపిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే చార్జీలు పెంచమని చప్పి ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన కరెంటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని, సూపర్ సిక్స్ హామీలను అములు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై మోయలేని భారాలు మోపితే ప్రజా పోరాటాలు తీవ్ర స్థాయిలో ఉంటాయని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో వున్న సమయంలో ఒక మాట అధికారంలోకి వచ్చిన తరువాత మరో మాట మాట్లాడుతుందని స్మార్ట్ మీటర్లను, కరెంటు చార్జీల పెంపును గతంలో వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ ఈ రోజు అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వై.క్రిష్ణ మోహన్, జి. మధుసూధన్ రావు,మేడా వెంకటేశ్వర్లు, సిపిఎం సీనియర్ నాయకులు పి. తిరుపాల్, సిపిఐ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, సిపిఐఎంఎల్ నాయకులు ఎల్.నరసింహా రెడ్డి, శ్రీ విముక్తి సంఘటన నాయకులు ఎల్.శ్యామల, వామపక్షాల పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## 'పేట' దర్గాలో గోడ తొలగింపుకు పరిశీలించిన అధికారులు



**అనుమసముద్రంపేట , ఆగస్ట్ 5 , ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీహజరత్ ఖాజా రహమతుల్లా నాయబే రసూల్ వారి పెద్ద దర్గా నుండి చిన్న దర్గాలు, ముస్లిం స్మశాన వాటికకు వెళ్ళేందుకు గతంలో ఉన్న పురాతన మార్గాన్ని పూర్వ పాలకుడు దర్గా మాజీ ముతవల్లి కావాలని దురుద్దేశంతో మూసివేసిన సంగతి తెలిసిందే. స్థానికులు భక్తుల సౌకర్యార్థం ఆమార్గాన్ని పునరుద్ధరించాలని స్థానిక మైనార్టీ సోదరులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వక్ఫ్ బోర్డ్ చైర్మెన్ హాజీ షేక్ అబ్దుల్ అజీజ్ కు విన్నవించడంతో ఈనెల 1వతేదీ శుక్రవారం వక్ఫ్‌బోర్డ్ చైర్మెన్ పరిశీలించారు. అడ్డుగోడ తొలగింపు వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి నివేదిక తేవాలని కసుమూరు దర్గా ఇఒ షేక్ షరీఫ్‌ను ఆదేశించడంతో ఆయన మంగళవారం సంబంధిత ప్రాంతాన్ని గోడను పరిశీలించారు. స్థానికంగా దీనిపై వ్యక్తమవుతున్న అభ్యంతరాలు స్థానికులు భక్తుల అవస్థలను పరిశీలనాధికారి నమోదు చేశారు. ధార్మిక ప్రదేశాల మధ్య ఉన్న అనుసంధాన మార్గాన్ని చైర్మెన్ సూచనలతో త్వరలో తొలగిస్తామని పరిశీలనాధికారి షేక్ షరీఫ్ తెలిపారు. ఈదర్గాను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు వక్ఫ్‌బోర్డ్‌చైర్మెన్ కంకణం కట్టుకొని ఉన్నారని, 3కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారని దర్గాలో ప్రస్తుతం ఉన్న పాత కట్టడాలను తొలగించి వాటి స్థానంలో నూతన భక్తుల వసతి గృహాలు, షాపింగ్ కాంప్లెక్స్ , టాయిలెట్స్, మద్రసాతోపాటు నూతనంగా డిజిటల్ మ్యాపింగ్ చేసేందుకు చైర్మెన్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భర్త మైనార్టీ నాయకుడు షేక్ జిలానీబాషా, తెలుగుదేశంపార్టీ మండల కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రహమత్‌నవాజ్, దర్గా అకౌంటెంట్ షేక్ ఖాజా హుసేన్, దర్గా సిబ్బంది, స్థానిక మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఉద్యోగాలకు ధరఖాస్తు చేసుకోండి



**రాపూరు,ఆగష్టు5ప్రభాతవార్త :** రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కలువాయి, సైదాపురం మండలాల్లో ఖాళీగా వున్న అంగన్ వాడీ కార్యకర్త 1, అంగన్‌వాడీ సహాయకులు 7 పోస్టులకు అర్హులైన వారు ధరఖాస్తు చేసుకోవాలని రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ సునంధ కోరారు. ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకునే వారు 10 తరగతి ఉత్తీర్ణులై వుండాలన్నారు. వయస్సు జూలై 1, 2025 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వుండి స్థానిక వివాహిత మహిళై వుండాలన్నారు. సైదాపురం మండలంలోని చాగణం గ్రామంలో ఓసి జనరల్ మహిళకు సంబందించి అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సహాయకులకు సంబందించి సైదాపురం మండలంలోని ఊటుకూరు పంచాయితీలోని ఊటుకూరు 2 ఎస్‌సి (2)కు, తురిమెర్ల పంచాయితీలోని పిలగానిలో ఓసి జనరల్, తలుపూరు పంచాయితీలోని చావతిప్పలో ఎస్‌టీ మహిళకు, గిద్దలూరు పంచాయితీలోని గిద్దలూరు 2లో ఓసి జనరల్ మహిళకు కేటాయించడం జరిగిందన్నారు. కలువాయి మండలంలో కలువాయి పంచాయితీలోని నడిమివీధి ఓసి జనరల్‌కు,కనకమహల్ బిసి(డి)కి పెరంకోండ పంచాయితీలోని దాసరిపల్లి ఓసి మహిళ, కు ఖాళీలు కేటాయించడం జరిగిందని ఆసక్త కలిగిన వారు మంగళవారం నుండి ఆగష్టు 26వ తేది లోపు రాపూరులోని ఐసిడిఎస్ కార్యలయంలో సిడిపిఒ వద్ద ధరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## అంగన్‌వాడీ హెల్పర్స్ పోస్టులకు ధరఖాస్తు చేసుకోండి



**మనుబోలు ఆగష్టు 5 ప్రభాతవార్త :** మనుబోలు మండలంలో కాళీగా ఉన్న 03 అంగన్‌వాడీ హెల్పర్స్ పోస్టులకు ఆగష్టు 05 నుండి 26 వ తేది సాయింత్రం వరకు అర్హత కలిగిన అభ్యర్డుల నుండి ధరఖాస్తులు తమ పరిధిలో గల సిడిపిఒ ఐసిడిఎస్ ప్రాజక్టులలో ధరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిశు అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మీ సూచించారు. ఎస్‌సి కేటగిరికి సంబందించి వీరంపల్లి మురియు బద్దెవోలు నందు 2 పోస్టులు, కొమ్మలపూడి నందు ఒక పోస్టు ఎస్‌టి కేటగిరికి సంబందించి ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఇందుకు సంబందించి 10 వతరగతి పాసు కాబడి ఉండవలెనని అన్నారు . 1జులై 2025 నాటికి 21 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు.స్ధానిక వివాహిత మహిళ అయి వుండాలని అన్నారు. అవివాహితులు అర్హులు అనర్హులు అని తెలిపారు. పై పోస్టులు ఎంపిక ప్రక్రియ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రూల్ ఆప్ రిజర్వేషన్ మేరకు జరుగునని కావున ఈ ప్రాంతంలో ఖాళీ గాఉన్న పోస్టులకు ఏ కులం నిర్ణయించ బడినదో సదరు కులం వారు మాత్రమే అర్హులని తెలిపారు. పదోవ తరగతి పాస్ కాబడిన వారు ఎవరు లేని యడల తదుపరి తరగతుల వారు అర్హులనీ తెలిపారు. 21 సంవ్సరాల నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు లేని యెడల 18 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల వారు అర్హులని ఆమె తెలిపారు.

## పుట్టిన బిడ్డకు ముర్రుపాలు మొదటి వ్యాధి నిరోధక టీకా



**మనుబోలు ఆగష్టు 5 ప్రభాతవార్త :** పుట్టిన బిడ్డకు ముర్రుపాలు మొదటి వ్యాధి నిరోదక టీకాలాంటివని సూపర్‌వైజర్ సిహెచ్ ఆదినారాయణమ్మ తెలిపారు. సిడిపిఒ విజయలక్ష్మీ ఆదేశాల మేరకు మనుబోలు హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నాడు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతు బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు త్రాగించాలని సూచించారు. ఆరు నెలల తరువాత బిడ్డకు అనుబంధ పోషకాహారాలు అందించాలని తెలిపారు. ప్రతి ఒక్క గర్బవతి తను ప్రసవించిన వెంటనే బిడ్డకు ఏవిధంగా పాలు పట్టించాలి అని ప్రదర్శన రూపంలో తెలియజేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త జి.నిర్మల,ఎం.విజయ , కె సుజనా పాల్గొన్నారు.

## ఫ్లోరోసిన్ స్క్రీనింగ్‌పై అవగాహన



**కావలి,రూరల్,ఆగష్టు5,ప్రభాతవార్తః** కావలి రూరల్ మండలం సర్వాయపాళెం,తుమ్మలపెంట ప్రాదమిక ఆరోగ్యకేంద్రాల పరిదిలోని కొత్తపల్లి, సిరిపురం ,మొర్లవా రిపాళెం ,తుమ్మలపెంట గ్రామాలలోని పాఠశాలల్లో విద్యార్థు లకు ఫ్లోరోసిన్ స్క్రీనింగ్,అవగాహనా కార్యక్ర మాన్ని మంగళవారం నిర్వహించారు. మరియు సర్వాయ పాళెం ఆరోగ్యకేంద్రంలో ఆశాకార్యకర్తల సమావేశంలోకూడ ఫ్లోరోసిస్‌మీద శిక్షణాకా ర్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఫ్లోరోసిస్ స్టేట్ కన్సల్‌టెంట్ డాక్టర్ దివ్య, సర్వాయ పాళెం ప్రాదమిక ఆరోగ్యకేంద్ర వైద్యాదికారి డాక్టర్ పి ప్రతిమ,డాక్టర్ శ్రీనివాసులు,మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



**కావలి,రూరల్,ఆగష్టు5,ప్రభాతవార్తః** తల్లిపాలే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యమని డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి అన్నారు.ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సహకారంతో కావలి వైకుంతపురం, చేవూరివారితోట, చాకలి కాలనీలోని అంగన్‌వాడి కేంద్రాలలో మంగళ వారం తల్లిపాల వారోత్సవాల సందర్బంగ తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి,డైరెక్టర్ కూనం తాతిరెడ్డి,సామాజిక కార్యకర్త ఎం మాలకొండారెడ్డి,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుభాషిణిలు పాల్గొని మాట్లాడారు బిడ్డపుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టిస్తే అమృతంలాగ పనిచేస్తాయని తల్లిపాలల్లో రోగనిరోదకశక్తి వుంటుందని తెలిపారు. తల్లిపాలే బిడ్డకు వరమని పసికందు మెదడు చురుకుగ పనిచేయడంతోపాటుజ్ఞాపకశక్తి పెరుగుతు ందని తెలియజేశారు.నవజాతి శిశువు ఆరోగ్యంగ పెరగడానికి తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.కనీసం ఆరునెలలు తప్పనిసరిగ బిడ్డకు పాలు ఇవ్వాలని పేర్కొన్నారు.తల్లిపాలవల్ల బిడ్డకు,తల్లికి అనేక ప్రయోజనాలు వున్నాయని వివరించారు.పాలు ఇవ్వడంవల్ల తల్లికి మానసిక వత్తిడి తగ్గించి బాలింతదశలో రక్తస్రవాన్ని తగ్గిస్తుందని చెప్పారు.రొమ్ము,అండాశయ కాన్సర్ రాకుండ బాలింతలను కాపాడు తుందని తెలిపారు.అనంతరం రామ్‌సెంటర్‌వారు ఐరన్ సిరప్‌లు పౌష్టికాహారం పంపిణిచేశారు. సచివాలయ పోలీస్‌పవిత్ర,అంగన్‌వాడి టీచర్లు జ్యోతిలక్ష్మి, కోటేశ్వరమ్మ,గర్బవతులు బాలిం తలు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నెల్లూరు పర్యటనను విజయవంతం చేద్దాం



**కావలిరూరల్,ఆగష్టు5,ప్రభాతవార్తః**ఈనెల 13వతేదిన నెల్లూరులో జరిగే సారద్యం సభను,బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పిసిఎన్ మాధవ్ నెల్లూరు జిల్లా పర్యట నను విజయవంతం చేయానలి బిజెపి కావలి పట్టణ శాఖ పిలుపునిచ్చారు.భారతీయ జనతాపార్టి కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఒకటవ పట్టణ అధ్యక్షుడు మందా కిరణ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం బిజెపి పట్టణ కార్యాలయంలోపట్టణ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పలువురు బిజెపి నాయకులు మాట్లాడారు.కావలి పట్టణ పరిధిలోని బూత్‌కమిటి అధ్యక్షుడు,పట్టణ పదాదికారులు,రాష్ట్ర,జిల్లా పదాదికారులు అందరుభాద్యతగ సమిష్టిగ కృషిచేసి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాదవ్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.అలాగే ప్రతినెల చివరి ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోది మన్‌కీబాత్ కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రతి బూత్‌లో నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు,జల్లా టెలికమ్ అడ్వయ్‌జరి కమిటి సభ్యుడు కుట్టుబోయిన బ్రహ్మానందం వింతారంగా రెడ్డి,పరసు వెంకటేశ్వర్లు,జల్లా ఉపాద్యక్షురాలు మాధవిరెడ్డి,రెండవ పట్టణ అధ్యక్షుడు లక్కరాజు భాస్కర్ ,పట్టణ ఉపాద్యక్షుడు కోడూరు మురళీకృష్ణ,పట్టణ ప్రదానకార్యదర్శి గుడిపల్లిప్రసన్న కుమార్, కార్యదర్శి మట్టా మల్లికార్జున,నెల్లూరు సుభాష్,దేవెండ్ల రాకేష్ తదితర బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీలో రెండు పూట్ల హాజరు తప్పనిసరి




**కోవూరు, ఆగస్టు5 ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలంతా ఆగస్టు 10వ తేది నుంచి వచ్చిన మార్పుల కారణంగా ఎన్ఎంఎంఎస్ యాప్‌లో రెండు పూటల హాజరు నమోదు చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ , డ్వామా ఏపీడీ మృదుల అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం కోవూరు డ్వామా సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు , టీఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మండలంలో ఈ పథకం కింద పనిచేసే కూలీల శాతాన్ని పెంచాలన్నారు. ప్రస్తుతం ఈకేవైసీ విధానంతోనే హాజరు కూడా వేయడం జరుగుతుందన్నారు. చేపట్టే పనుల్లో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అదేవిధంగా ఈ పథకం కింద పనుల గుర్తింపు, నిర్వహణ సమయంలో భువన యాప్, యుక్తదారా యాప్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. డ్వామా ఏపీడీ శంకర్ నారాయణ, టీవోటీ శ్రీనివాసులు పలు సూచనలు చేశారు. ఈ శిక్షణలో డ్వామా పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించిన వారు పాల్గొన్నారు.

## డ్రగ్స్ అనేది అంటువ్యాధితో సమానం



**కోవూరు, ఆగస్టు5 ప్రభాతవార్త :** ముక్కు పచ్చలారని యువత డ్రగ్స్ బారిన పడి తమ భావి భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీ నగర్‌లో ఉన్న వైకేఆర్ అండ్‌కే డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో మంగళవారం డిగ్రీ యువతకు డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చేతిలో దేశ భవిష్యత్తు ఉందని, డ్రగ్స్ బారిన పడితే వారి జీవితమే అంధకారమయ్యే పరిస్థితి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాటును సరదాగానే ప్రారంభిస్తారని, అనంతరం దానికి బానిసలవుతున్నారన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ ఉన్నా, డ్రగ్స్ విక్రయిస్తున్నా, వాడుతున్నా 112 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం యువత తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోకుండా తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లి తమ భావి భవిష్యత్తును పాడు చేసుకోరాదన్నారు. దేశ ఆర్థిక రంగం పురోగతి చెందాలంటే యువతే ప్రధానమన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో యువత చెడువ్యసనాలకు అలవాటు పడి ఇటు కుటుంబ పరువుతో పాటు తమ పరిస్థితిని కూడా దిగజార్చుకోరాదన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌ప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మధుసూదన్‌రావులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవ స్థానం లో మంగళవారం ప్రాత: కాలమునే స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభి షేక పూజలు సాంప్రదాయ బద్దంగా భక్తిశ్రద్దల తో నిర్వహించారు. అనంత రం నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూ జలు చేపట్టారు. ఈ సందర్భంగా పల్లకి సేవ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టా రు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, భక్తులు ఉన్నారు.

## నేడు మూడు గంటల పాటు విద్యుత్ కోత



**కోవూరు, ఆగస్టు5 ప్రభాతవార్త :** కోవూరు ట్రాన్స్‌కో సబ్ డివిజన్ పరిధిలోని ఇనమడుగు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేస్తున్న దృష్ట్యా బుధవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇనమడుగు సబ్ స్టేషన్ పరిధిలోని ఇనమడుగు, జమ్మిపాలెం, లేగుంటపాడు, చెర్లోపాలెం గ్రామాల్లో ఉదయం 6 నుంచి 9 వరకు విద్యుత్ సరఫరా నలిపివేయడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ వినియోగదారులు ట్రాన్స్‌కో శాఖకు సహకరించాలన్నారు.

Form No. INC-19
(Pursuant to Rule 22(1)(b) of the Companies (Incorporation) Rules, 2014)
PUBLIC NOTICE
Notice is hereby given that JK NOPS MEMBERS ASSOCIAITON, a company registered under Section 8 of the Companies Act, 2013, CIN: U 85320 AP2018NPL109322 having its registered office at 16-9-367 Himalaya Apartments Bank colony Nellore 524002, has applied to the Regional Director, South East Region, MCA, for surrender of its licence under Section 8 and conversion into a private limited company for the purpose of voluntary winding up.
Any person whose interest is likely to be affected may submit objections, if any, to the Regional Director, South East Region, Ministry of Corporate Affairs, 2nd Floor, Corporate Bhawan, GSI Post, Nagole, Bandlaguda, Hyderabad - 500 068, within 21 days from the date of this notice.
For JK NOPS MEMBERS ASSOCIATION
SD/- K Madhava Reddy, Director,
Din:08238166
Place: Nellore
Date: 05-08-2025

## తెగుళ్ల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి




**కోవూరు, ఆగస్టు5 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పాటూరు, గుమ్మలదిబ్బ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం ఈ సీజన్‌లో వచ్చే వివిధ రకాల తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో కంకినల్లి దోమ ఎక్కువగా ఉన్నందున వీటి నివారణకు గానూ వేప నూనె ఎకరానికి 500 ఎంఎల్ పిచికారి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా దోమ ఉధృతి ఎక్కువగా ఉంటే పైమెట్రోజన్ 50 గ్రాములు పిచికారి చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా రైతులు శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వాడుకోవడమే కాకుండా తెగుళ్ల ఉధృతిని గమనించి దానికి అనుగుణంగా మందులు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి టి. రజని, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభ, చందన, రైతులు ఉన్నారు.

## పాత్రికేయుల సమస్యలు పరిష్కరించాలి



**కోవూరు, ఆగస్టు5 ప్రభాతవార్త :** కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీయూ డబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి నయీమ్ ఖాన్ ఆధ్వర్యంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తు తం ఏ ప్రభుత్వం కూఆ జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోర్కెలను ఆమోదించడం జరగ లేద న్నారు. సమాజంలో జర్నలిస్టులుగా ఉన్న ప్రతి ఒక్కరూ ఓటర్లే అని అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అమలు చేసే ప్రభుత్వం తమ గురించి పట్టించుకోవడం లేదన్నారు. అర్హత కలిగిన వారికి ఇంటి స్థలాలతో పాటు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే పరిధిలోని కార్యవర్గ సభ్యులు, పాత్రికేయులు ఉన్నారు.

## గిరిజన సంఘాల నేతలు తమను మోసం చేశారు

– గిరిజన మహిళ ఆవేదన




**కోవూరు, ఆగస్టు5 ప్రభాతవార్త :** జిల్లాలో రాష్ట్ర నాయకులు అని చెప్పుకునే గిరిజన నాయకులను నమ్ముకుని లక్షలాది రూపాయలు తమ నుంచి వారి ఖాతాలకు మరుల్చుకున్నారని అదేమని అడిగితే ఇది మీ డబ్బులు కాదంటూ ఆ గిరిజన నేతలు తమను మోసం చేశారంటూ కోవూరు మండలం చెర్లో గాంధీ సంఘానికి చెందిన ఈగ మారుతమ్మ కోవూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త 2020లో చనిపోతే 2023లో తనకు 8 లక్షల రూపాయలు రావడం జరిగిందన్నారు. కానీ గిరిజన సంఘాల నాయకులు అని చెప్పుకునే కేసీ పెంచలయ్య, ఉషలు తనను మోసం చేసి తనకు మాయమాటలు చెప్పి తన అకౌంట్‌లో పడిన డబ్బులను వారి ఖాతాల్లో జమ చేసుకున్నారన్నారు. డబ్బుల కోసం వారి చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేదన్నారు. తాము బాగా చదువుకుని ప్రభుత్వం ఉద్యోగం చేయాలనే లక్ష్యంతో ఉన్నా ఇటువంటి గిరిజన సంఘాల నాయకుల వలన తాము అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమకు మాయమాటలు చెప్పి ఈ డబ్బులు ప్రస్తుతం మీవి కాదని, వేరే వారికి సంబంధించి మీ ఖాతాలో వేశారని నమ్మించి తమ ఖాతాలోకి మార్చుకున్నారన్నారు. ఇటువంటి గిరిజన నాయకుల కారణంగా జిల్లాలో అనేక మంది మోసాల బారిన పడ్డారన్నారు. తన బ్యాంక్ ఖాతా నెంబర్ ఇండియన్ బ్యాంక్ కోవూరు బ్రాంచ్ 033310100222548 నుంచి 7 లక్షల రూపాయల నగదు కేసీ పెంచలయ్య, చెంబేటి ఉష అకౌంట్ నెంబర్ 0111917603కు బదిలీ అయ్యాయన్నారు. ఈ విషయంలో కోవూరు పోలీసులు తనకు న్యాయం చేయాలని ఎస్సై రంగనాథ్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కేసు నమోదు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్సై తెలిపారు.

## బ్లాంకెట్ సర్వేకు పాడి రైతులు సహకరించాలి




**కోవూరు, ఆగస్టు5 ప్రభాతవార్త :** కోవూరు పశు సంవర్థక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు, విడవలూ రు మండ లాలకు సంబంధించిన పాడి రైతులు ప్రస్తుతం పశు సహాయకులు చేస్తున్న బ్లాంకెట్ సర్వేకు పూర్తిస్థాయిలో సహకరించాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ బ్లాంకెట్ సర్వే పాడి రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. మీ ఇంటికి వచ్చే పశు సహాయకులకు మీ ఇంట్లో ఎన్ని గేదెలు ఉన్నాయి.. ఎన్ని ఆవులు ఉన్నాయి.. వాటి నుంచి పాలు ఏ మేర వస్తుంది .. అదేవిధంగా ఇప్పటివరకు ఏమైనా పశు బీమా కార్డుల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారా.. అనే విషయాలు అడుగుతారని, దానిని వారు తప్పనిసరిగా అందజేయాలన్నారు. అదేవిధంగా ఇప్పటివరకు పశు బీమా చేసుకోకపోతే అటువంటి వారు కూడా వివరాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా కృత్రిమ గర్భధారణపై రైతులు సమ్మతిగా ఉంటే అటువంటి వారు కూడా ఆ వివరాలు అందజేయాలన్నారు. ఇటువంటి వివరాలను తప్పనిసరిగా పాడి రైతులు పశు సహాయకులకు అందజేయాలన్నారు.

## బ్యాంక్ రుణాల రికవరీపై దృష్టి సారించాలి



**కోవూరు, ఆగస్టు5 ప్రభాతవార్త :** కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం వీవోఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీనిధి మేనేజర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ పొదుపు గ్రూపులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా పొదుపు గ్రూపులు ప్రతి నెల క్రమం తప్పకుండా పొదుపు సమావేశాలు ఏర్పాటు చేసుకుని రుణాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా లోకోస్ యాప్‌ను సకాలంలో పూర్తి చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. పొదుపు మహిళలకు కిచెన్ గార్డెన్లపై మరింత అవగాహన కల్పించి వాటిపై వారు దృష్టి సారించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏపీఎం సుబ్బరాజు వీవోఏలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షురాలు రమ్య, సీసీలు రాజశేఖర్, రాము, శోభ, సునీల్ తదితరులు ఉన్నారు.

## 8న కొండ బిట్రగుంట లో వరలక్ష్మీవ్రతం

**బిట్రగుంట ఆగస్టు 5 ప్రభాతవార్త:** బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్ల దేవస్థానం నందు ఈ నెల 8 వ తేదీన శుక్రవారం వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రాధాకృష్ణ తెలిపారు. స్వామి వారి దేవస్థానం నందు ఉదయం : 5 గంటలకు సుప్రభాత సేవ, అభిషేకము, అర్చన, సహస్ర నామార్చన, నైవేద్యము అనంతరం ఉదయం 10.00 గంట లకు వరలక్ష్మీవ్రతం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని చెప్పారు.కావున భక్తులు పై పూజ కార్యక్రమములు నందు పాల్గొని స్వామి వారి ,అమ్మవారి కృపకు పాత్రులు కావలసినదిగా విజ్ఞప్తి చేశారు.

## అంగన్‌వాడీ పోస్టులకు 26వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలి



**కోవూరు, ఆగస్టు5 ప్రభాతవార్త :** కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చి మండలాల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాల పోస్టులకు అర్హత కలిగిన లబ్దిదారులు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవో ఉమా తెలిపారు. కోవూరు ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు, 16 ఆయాల పోస్టులకు ఈ నెల 26వ తేదీలోగా అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా పదవ తరగతి పాసై ఉండాలని జులై 1 2025 నాటికి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలన్నారు. ముఖ్యంగా స్థానికంగా వివాహిత మహిళ అయి ఉండా లన్నారు. పోస్టుల ఎంపిక ప్రక్రియ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జరుగుతుందన్నారు. బుచ్చి మండలంలో 1 అంగన్‌వాడీ కార్యకర్తల, 3 ఆయాల పోస్టులు, కొడవలూరు మండలంలో 1 అంగన్‌వాడీ కార్యకర్తల, 4 ఆ యాల పోస్టులు, కోవూరు మండలంలో 7 ఆయాల పోస్టులు, విడవలూరు మండలంలో 2 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటికి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

## ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి

– పుట్టిన శిశువుకు అరగంటలోగా పాలు పట్టిస్తే అనేక ప్రయోజనాలు



**కోవూరు, ఆగస్టు 5 ప్రభాతవార్త :** తలి పాలు బిడ్డకు అమృతంతో సమానమని, పుట్టిన వెంటనే ము ర్రు పాలు తాగించడం వలన వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజం ప్రమీల అ న్నారు. కోవూరు మండలం ఇనమడుగు సెక్టార్ పరిధిలోని ఇనమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్బవ తులకు, బాలిం తలకు తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వాటి విశిష్టతను వివరించడమే . ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ శిశువు ఎదుగుదలకు తల్లిపాలు శ్రేయస్కరమని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి గర్బవతి మంచి బలవర్ధకమైన పోషకాహారం తీసుకోవాలన్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉండడంతోనే ఈ విషయాన్ని తల్లులకు వివరించేందుకే ప్రభుత్వం ఆగస్టు నెలలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. తల్లిపాల వలన బిడ్డకు ప్రోటీన్‌లు అంది మెదడు వికసించడంతో పాటు శిశువుకు సమతుల్యమైన ఆహారం అందుతుందన్నారు. ముఖ్యంగా తల్లిపాలలో బిడ్డకు అవసరమయ్యే విట మిన్‌లు పుష్కలంగా లభిస్తాయన్నారు. వీటితో పాటు తల్లిపాలలో లాక్టోజ్ ఉండడంతో కాల్షియం నిల్వలు బిడ్డలో పెరిగి రక్తహీనత బారిన పడకుండా కాపాడతాయన్నారు. తల్లి బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. గర్భదానం తరువాత రక్తస్రావం ప్రమాదం తొలగి త్వరగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తల్లికి పాలు పుష్కలంగా రావాలంటే గర్భిణిగా ఉన్నప్పుడే మంచి పోషకాహారం గల గుడ్లు, చేపలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. .. అనంతరం పోషకాహారం కిట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో, సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

## వైభవంగా తొలి ఏకాదశి పూజలు
## స్వామి అమ్మవారికి వెండి కిరీటాలు బహుకరణ



**మనుబోలు ఆగష్టు 5 ప్రభాతవార్త :** స్దానిక విష్ణు ఆలయంలో శ్రావణ మాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వార్లకు ఆలయ అర్చకులు హనుమాచార్యులు శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వార్లకు వేకోజామున సుప్రభాత సేవను నిర్వహించారు. వేద మంత్రాలతో సాంప్రదాయ బద్దంగా శాస్త్రోక్తకంగా పంచామృతా అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మ వార్లను నూతన వస్త్రాలతో పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళహరతులతో పూజలు నిర్వహిం చారు. మహిళలు అదిక సంఖ్యలో పాల్గోని స్వామి వారి పూజలను తిలకించి మొక్కులు తీర్చుకున్నారు. మద్యహ్నం భారీస్దాయిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పొట్టి హనుమంతరావు, సూర్యకుమారి దంపతులు వారి కుమారుడు కిరణ్ కోడలు సుకన్య వ్యవహా రించారు. శ్రీదేవి,భూదేవి సమేత చెన్న కేశవస్వామి స్వామి మూల విరాట్‌లకు సుమారు రెండు లక్షల రూపాయాలు విలువ చేసే వెండి కిరీటాలను స్వామి వార్లకు బహుకరించారు.

## వ్యవసాయంలో సాంకేతిక పద్దతులను అనుసరించండి



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 5, ప్రభాతవార్త :** ఆధునిక సాంకేతిక పద్దతులను అనుసరించి వ్యవసాయం చేయడం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు శ్రమ కూడా తగ్గుతుందని వ్యవసాయశాఖ జాయింట్ డైరక్టర్ పి.సత్యవాణి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆమె ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడారు. రైతులు అధిక మోతాదులో యూరియా వాడడం వలన పంటలకు చీడ పీడలు ఆశిస్తాయని తెలిపారు. ఒక ఎకరానికి మూడు సార్లుగా రెండున్నర బస్తాలు అనగా 112 కేజీలు మాత్రమే యూరియాను పరిమితంగా వాడాలని తెలియజేశారు. జిల్లాలో ఇప్పటి వరకు వ్యవసాయశాఖ ద్వారా రైతులకు ఈ ఏడాది 37 డ్రోన్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతులు గ్రూపులుగా ఏర్పడి తమ వాటా కింద అకౌంట్లో రెండు లక్షలు జమ చేస్తే 9,80,00 రూపాయల విలువ చేసే డ్రోన్లను 80 శాతం సబ్సిడీతో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మరో నాలుగు డ్రోన్లు ప్రస్తుతం వ్యవసాయ శాఖ వద్ద ఉన్నాయని, రైతులు ముందుకు వస్తే నాలుగు డ్రోన్లను కూడా ఈనెల 15వ తేదీ లోపు అందజేస్తామని వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద సాగులో ఉన్న రైతులందరికి ప్రభుత్వం జమ చేసిన నిధులు అందాయని తెలిపారు. జిల్లాలో 99.9శాతం అన్నదాత సుఖీభవ నిధులు రైతుల అకౌంట్లలో జమ అయ్యాయని చెప్పారు. ప్రస్తుతం ఈ పంట నమోదు కార్యక్రమం జరుగుతోందని, ఇప్పటి వరకు జిల్లాలో 31 వేల ఎకరాల ఈ పంటను నమోదు చేయడం జరిగిందన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పంట నమోదు కార్యక్రమాన్ని, ఈనెల 15లోపు పూర్తి చేయాల్సి ఉందని వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా సమస్య లేదని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రాబోయే రబీ సీజన్‌కి చేపట్టబోయే సాగు ద్వారా ఎంత యూరియా అవసరమవుతుందో, ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. రాబోయే సీజన్‌కి ముందుగానే తగినంత యూరియాను నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉందని వెల్లడించారు.

## మనమిత్ర అవగాహన ర్యాలీని జయప్రదం చేయండి




**కావలి,రూరల్,ఆగష్టు 5,ప్రభాతవార్తః** నేడు జరగబోవు మనమిత్ర అవగాహన ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కావలి 13వవార్డు టిడిపి ఇన్‌చార్జ్ పోతుగంటి శ్రీకాంత్ తెలిపాడు. కావలి 13వవార్డునుందు మంగ ళవారం పోతు గంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మనమిత్ర అవగాహనా ర్యాలి నిర్వహిం చారు. ఈసంద ర్బగం శ్రీకాంత్ మాట్లాడారు. నేడు ఉదయం 10 గంటల కు కావలి ఎంమ్‌సి చైర్మన్ పోతుగంటి అలేఖ్య,పోతుగంటి శ్రీకాం త్ నేతృత్వంలో కావలి పుల్లారెడ్డనగర్ సచివాలయం నుండి మనమిత్ర ర్యాలి ప్రారంభమౌతుందని తెలియ జేశారు.ఈర్యాలినందు వార్డు ప్రజలు,ఎస్‌హెచ్‌సి సభ్యులు అదికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈకార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాజ హితం కోరుకునే ప్రతి ఒక్కరికి బెజవాడ గోపాల్‌రెడ్డి స్ఫూర్తిదాయకం



**బుచ్చి ఆగష్టు 5 ప్రభాతవార్త** స్వర్గీ య బెజవాడ గోపాల్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెం వాసులు కావడం మనందరికి గర్వకారణమని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా తెలిపారు. జమీందారుకు టుంబలో పుట్టి మాతృభూమి స్వాతంత్రం కోసం జైళ్ళుకెళ్ళిన ఆయన త్యాగం అమూల్యమని చైర్‌పర్సన్ కొనియాడారు. దివంగత నేత బెజవాడ గో పాల్‌రెడ్డి దేశభక్తి, సాహిత్యం పరిపాలన దక్షత గలిగిన విలక్షణ నాయ కుడని ఆమె కొని యాడారు. దివంగత నేత బెజవాడ గోపాల్‌రెడ్డిజయంతి ఈ సందర్బంగా పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నేటి తరానికి దివంగత నేత బెజవాడ గోపాల్‌రెడ్డి ఆదర్శ మని ఆమె తెలిపారు. జాతిపిత మహాత్మా గాంధీ అహింసావాద సిద్దాంతలకు ప్రభావితులై మాతృభూమి సేవలో తరించారని ఆమె కొనియాడారు. ఆయన బుచ్చిరెడ్డిపాళెం వాసి కావడం మన అందరికి ఆదర్శమని అన్నారు. బెజవాడ గోపాల్‌రెడ్డి త్యాగాలు చరిత్ర ఎన్నటికి మరచిపోరని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ డి. బాలకృష్ణ, వైస్ చైర్మన్ ఎరటపల్లి శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీ కాంతమ్మ. రాచూరు సత్యనారాయణ, చీర్ల ప్రసాద్‌యాదవ్, కో ఆప్షన్ సభ్యులు దస్తగిరి,పట్టణ తెలుగుదేశం పార్టీ టౌన్ అద్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, టిడిపినాయకులు ఎంవి శేషయ్య, దశరద్, షేక్ ఫర్వీనా ,వవ్వే రు శ్రీకాంత్‌రెడ్డి, రేబాల శ్రీకాంత్‌రెడ్డి., దుగ్గిశెట్టి హరినాద్ తదితరులు పాల్గోన్నారు.

## డిఎల్ఎన్ఆర్ హైస్కూల్‌ని ఆఖస్మికంగా తనిఖీ చేసిన చైర్‌పర్సన్





**బుచ్చి ఆగష్టు 5 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని డిఎల్ఎన్ఆర్ హైస్కూల్‌ని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా, కమిషనర్ బాలకృష్ణా కౌన్సి లర్లతో కలిసి ఆఖస్మికంగా తనీఖీ చేశారు. ఈ సందర్బంగా ఆమె మధ్యాహ్నం భోజనం రుచి చూశారు. కమిషనర్ ఆమె కొద్దిసేపు విద్యార్దులతో ముచ్చటించారు. అనంతరం ఆమె మాట్లాడుతు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేయాలని ఆమె సూచించారు. విద్యాశాకమంత్రి నారా లోకేష్, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విద్యార్దులపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు.మధ్యాహ్నం భోజనం పరిశీలించి బాగుందని ఇలాగే తయారు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి డిఎ ల్ఎన్ఆర్ హైస్కూల్ తనీఖీ చేసి వెళ్ళిన తరువాత ఇక్కడ పరిస్థితులు మెరుగు పడ్డాయని ఈ సంద ర్బంగా ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణా, వైస్ చైర్ పర్సన్ యరటపల్లి శివకుమార్‌రెరడ్డి, కౌన్సిలర్లు రహమత్ బాషా, పుట్టా లక్ష్మీకాంతమ్మ, రాచూరు సత్య నారాయణ, టిడిపి నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

## తల్లిపాల వారోత్సవాలపై అవగాహన



**సైదాపురం, ఆగష్టు 5, ప్రభాతవార్త** సైదాపు రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి శ్రావణి ఆధ్వర్యంలో మంగళవారం ఆశా వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి శ్రావణి తల్లిపాల వారోత్స వాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా వ్యాధినిరోధక టీకా వందశాతం పూర్తి చేయాలని, అబార్షన్‌లు జరగకుండా చూడాలని ఆమె సూచించారు. అదే విధంగా ఈనెల 12వ తేదీన జరిగే నేషనల్ డీ వార్మింగ్‌డే కార్యక్రమంపై ఆమె వివరించారు. ప్రతి ఆశా కార్యకర్త మీ పరిధిలోని టీబీ కేసులపై కళ్లె పరీక్షలు చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వరకాయల శశి, హెల్త్ సూపర్‌వైజర్లు పద్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరమైన విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి




**సైదాపురం, ఆగష్టు 5, ప్రభాతవార్త** బలవంతంగా బిగిస్తున్న ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లను తక్షణమే నిలుపుదల చేసి రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు డీపీ పోల య్య డిమాండ్ చేశారు. సైదాపురంలోని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ భారాలను మోపేందుకు స్మార్ట్ మీటర్లను తీసుకురావడం జరిగిందని, ఈ మీటర్లతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల దోపిడి చేస్తున్నారని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను, పేద, సామాన్య మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.అంకయ్య, ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు చంగలరావు, ప్రగతిశీల మహిళా నాయకురాలు మమత తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఉచితప్రయాణ పథకాన్ని విజయవంతం చేయండి




**కావలిరూరల్,ఆగష్టు5,ప్రభాతవార్తః** రాష్ట్ర ప్రభుత్వం ఆగష్టు 15వతేది నుంచి ప్రారంభిస్తున్న మహిళల ఉచిత ప్రయాణ పథకం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్క ఆర్టీసీ ఉద్యోగి కృషిచేయాలని కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ డి ఆదినారాయణ తెలియజేశారు.ఆర్టీసీ గ్యారేజ్ నందు ఆదర్శ ఉద్యోగుల అభినందనసభ మంగళవారం జరిగింద.ఈ కార్యక్రమంలో జులైమాసంలో తమకు కేటాయించిన లక్ష్యాన్ని సాధించిన ముగ్గురు కండక్టర్‌లకు నగదు బహుమతి అందజేశారు.115శాతం సాధించిన సిహెచ్ విజయకుమారి,108శాతం సాధించిన ఎం రాజశేఖర్,115శాతం సాదించిన కెవి శేషమ్మలకు డిపోమేనేజర్ నగదు అందజేసి మాట్లాడారు.ప్రతి ఉద్యోగి వీరిని ఆదర్శంగ తీసుకొని సమస్త ఆదాయపెంపునకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు.ఇద్దరు మహిళా కండక్టర్లు విజయకుమారి,శేషమ్మ,కాన్సర్ చికిత్స చేయించుకుంటూనె తన లక్ష్యాన్ని సాధించిన రాజేశేఖర్‌లు ఆదర్శప్రాయిలున్నారు. డ్రైవర్‌లు ఇందన పొదుపునకు కృషిచేయాలని పిలు పునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ ప్రారంబిస్తున్న ఉచిత ప్రయాణ కార్యక్రమాన్ని విజయవంతానికి అంకితభావంతో పనిచేయాలని అన్నారు.మెకానిక్ సోదరులు మహిళా ప్రయాణికుల రద్దీని తట్టుకునే విదంగ బస్సులను సిద్దం చేస్తున్నారని అభినందించారు.ఈకార్యక్రమంలో అసిస్టెంట్‌మేనేజర్(ట్రాఫిక్) ఎం కల్పన, అసిస్టెంట్ ఇన్‌జనీర్ (ఎస్‌కె ఖాజామొహిద్దీన్) ట్రాఫిక్ సూపర్‌ఇన్‌డెంట్ ఎం రామకృష్ణ సిస్టమ్ సూపర్‌వైజర్ టి శివశంకర్ ప్రసాద్,మెకానికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర ఆరోగ్య సమస్య.. రక్త ప్రసరణ వ్యాధులపై అవగాహన



**నెల్లూరు, ఆగష్టు 5, ప్రభాతవార్త – వైద్యం** రక్త ప్రసరణ సమస్యలపై అవగాహన కల్పించి, కాళ్ళు, వేళ్ళు కోల్పోకుండా ప్రజలను రక్షించడానికి వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం ఆగష్టు 6న జాతీయ రక్త ప్రసరణ వ్యాధుల అవగాహన దినోత్సవం నిర్వహిస్తోంది. ఈ రోజున ఈ వ్యాధుల గురించి వాటి నివారణ మార్గాల గురించి ప్రజలకు తెలియజేస్తారు.

**రక్త ప్రసరణ ఎందుకు తగ్గుతుందిః** రక్త ప్రసరణ తగ్గడానికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి.

### జాతీయ రక్త ప్రసరణ వ్యాధుల అవగాహన దినోత్సవం

**– పొగలోని హానికర నికోటిన్, ఇతర రసాయనాలుః** పొగలోని నికోటిన్, ఇతర హానికర రసాయనాలు రక్తనాళాలు కుంచించుకుపోయేలా చేస్తాయి. తద్వారా రక్తం సక్రమంగా ప్రవహించదు.

**– నికోటిన్ వలన రక్తం చిక్కబడటంః** నికోటిన్ రక్తాన్ని చిక్కబడేలా చేసి, రక్త ప్రవాహానికి అడ్డంకులు సృష్టిస్తుంది.

**– షుగర్ వ్యాధి ప్రభావంః** షుగర్ వ్యాధి రక్త నాళాలలో కొలెస్ట్రాల్ పేరుకుపోయేలా చేస్తుంది. ఇది రక్తనాళాలను మరింత సన్నబరుస్తుంది. ఈ కారణాల వలన రక్తనాళాలు సన్నబడటం వల్ల రక్త ప్రవాహం తగ్గి, శరీర భాగాలకు తగినంత రక్తం అదక అవి దెబ్బతింటాయి. ముఖ్యంగా కాళ్ళకు చేతులకు రక్తం అందకపోతే తీవ్రమైన నొప్పి వేళ్ళలో మంట, గాయాలు మానకపోవడం లేదా వేళ్ళు నల్లగా మారడం వంటివి సంభవించవచ్చు.

**రక్త ప్రసరణ సమస్యలను ఎలా గుర్తించాలిః** రక్త ప్రసరణ తగ్గిందని గుర్తించడానికి కొన్ని ముఖ్య లక్షణాలుః




నడిస్తే లేదా పని చేస్తే నొప్పి కొంత దూరం నడిస్తే కాళ్ళలో నొప్పి వచ్చి ఆగవలసి రావడం లేదా పని చేస్తే చేతలలో నొప్పి వచ్చి పని ఆపాల్సి రావడం రక్త ప్రసరణ తగ్గితే వచ్చే మొదటి లక్షణం.

**వేళ్లలో విపరీతమైన మంటః** తర్వాత దశలో వేళ్లలో విపరీతమైన మంట వస్తుంది. ఈ మంట వలన నిద్ర పట్టకపోవచ్చు.

**వేళ్ళు నల్లబడటం లేదా పుండ్లు పడటంః** రక్త ప్రసరణ భాగా తగ్గినప్పుడు వేళ్ళు నల్లగా మారి, పుండ్లు ఏర్పడతాయి. వారు తెలిపిన వివరాల ప్రకారం, రక్త ప్రసరణ సమస్యలను మొదటి దశలోనే గుర్తిస్తే మాత్రల ద్వారానే రక్త ప్రసరణను మెరుగుపరుచుకోవచ్చు. ఒక వేళ వేళ్ళు నల్లబడే దాకా వస్తే కూడా, వాటిని పూర్తిగా తీసివేయకుండా ఆధునిక వాస్కులర్ సర్జరీ పద్దతుల ద్వారా రక్త ప్రసరణను పునరుద్దరించుకోవడానికి అవకాశాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ వాస్కులర్ అండ్ ఎండోవాస్కులర్ సర్జన్ డాక్టర్ వై. సుదర్శన్‌రెడ్డి కన్సల్టెంట్ వాస్కులర్ అండ్ ఎండోవాస్కులర్ సర్జన్, మెడికవర్ హాస్పిటల్ నెల్లూరు.

## వాట్స్‌అప్ మనమిత్ర గుడ్ గవర్నన్స్ పై అవగాహన ర్యాలీ



**అల్లూరు,ఆగష్టు 5 ప్రభాతవార్తః** అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని సచివాలయాల్లో వాట్స్ అప్ మనమిత్ర గుడ్ గవర్నెన్స్ పై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ అల్లూరులో కమిషనర్ ఉమామహేశ్వర రావు. సచివాలయ సిబ్బంది. తెలుగుదేశం నాయకులు. ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్స్‌అప్ గుడ్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వం అందించే 539 రకాల సేవలను ప్రజలు ఆఫీసులు చుట్టూ తిరగకుండా వాట్స్‌అప్ మనమిత్ర ద్వారా నమోదు చేసుకోని సేవలు పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ డి డి ఓ వరప్రసాద్ తెలుగుదేశం నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి. రామిశెట్టి కృష్ణ చైతన్య. నీలపు రెడ్డి హరీష్ కుమార్ రెడ్డి. బిట్రగుంట వెంకట చైతన్య రెడ్డి. పాశం దయాకర్. కావలి జగన్. నజీర్ భాష. ఇస్మాయిల్. ఖదీర్. కావలి వెంకయ్య. సచివాలయ సిబ్బంది. తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీగా సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నిక



**విడవలూరు, ఆగష్టు 5, ప్రభా తవార్తః** మండలంలోని ఇటీవల కా లంలో ఎంపీపీ వేణుబాక భవన మ్మ మృతి చెందడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మం డలంలో ఎంపీటీసీ ఎన్నికల ఆదే శాలు జారీ చేయడం జరిగింది. అయితే మండలం, గ్రామ నాయ కుల కలసి చలంచర్ల కామేశ్వ రమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆర్వో ధ్రువీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నగేష్ కుమారి మాట్లాడుతూ ఇటీవల కాలంలో మరణం జరగడం జరిగింది కావున నూతనంగా ఎన్నికలు జరగడం గ్రామ నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి ఆర్వో, పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలంచర్ల కామాక్షమ్మ మాట్లాడుతూ పార్టీ కోసం అన్ని విధాలుగా పాటుపడడం జరుగుతుందని, అలాగే త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికలో గెలుపు కోసం ఉండడం మిగించి పనిచేస్తామని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి సి చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి, ఐ టి డి పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవోలు సత్యం రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, టిడిపి యువ నాయకులు తిక్కవరపు అశోక్, పాలజనార్ధన్, చలంచర్ల శ్రీవిద్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకి ఘన సన్మానం



**విడవలూరు, ఆగష్టు 5, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో బిట్టు వన్ ఎంపీటీసీగా మంగళవారం స్థానిక నాయకులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన ఎంపీటీసీ చలంచర్ల కామేశ్వరమ్మను ఎన్నుకోవడం జరిగింది.తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమల సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే, స్థానిక మండల నాయకులు అడపాల శ్రీధర్ రెడ్డి, ఆలోచన మేరకు స్థానిక డిసి చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి సహకారంతో తమకు ఈరోజు ఈ ఎంపిటిసి పదవి వచ్చిందని ఆమె తెలియజేశారు. పార్టీ కోసం ఎల్లవేళలా పనిచేస్తామని ఆమె తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో చెముకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వావిలేరులో పొలం పిలుస్తోంది



**చేజర్ల ఆగష్టు 5 ప్రభాతవార్త** చేజర్ల మండలంలోని వావిలేరు పాడేరు గ్రామాలలో పొలం పిలు స్తొంది కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసయాధికారి పి.హిమబిందు పాల్గోని రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఏడగారు పంట వేసిన రైతులు, పంట నమోదు చేసుకోవాలని అన్నారు . వరిలో వచ్చే తెగుళ్ళకు వ్యవ సాయాధికారులు సూచనలు పాటించాలని తెలిపారు.అన్నదాత సుఖీ బవ పథకంలో ఎంపిసి లేంకు లేని రైతులు తప్పని సరిగా లింకు చేసుకొంటి డబ్బులు జమ అవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వావిలేరు.,పాడేరు గ్రామ సర్పంచ్‌లు గోనుగుంట రాంబాబు, గుమ్మా వెంకటేశ్వర్లు, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గోన్నారు.

## అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు



**సైదాపురం, ఆగష్టు 5, ప్రభాతవార్త** మండలంలో ఉన్న రైతు సేవ కేంద్రం లో పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకెళ్లి పేర్లు నమోదు చేసుకుని విత్తనాలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి తెలిపారు. మం డల పరిధిలోని చాగణం, చాగణంరాజు పాలెం గ్రామంలోని రైతు సేవ కేంద్రం పరిధిలో మంగళవారం ఆమె పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు లు వేసిన నిమ్మచెట్లను పరిశీలించారు. నిమ్మలో చెక్కర తెగులు, మసి తెగులు నివారణపై రైతులకు అవగా హన కల్పించారు. అలాగే యూరియా వాడకం, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. నాయకులు జయరాఘవరెడ్డి, రాఘవరెడ్డి, కందాటి దయాకర్‌రెడ్డి, విజిల్‌రెడ్డి, సుబ్బరామయ్య రైతులు పాల్గొన్నారు.

## నెల్లూరు వాసి, అల్లాబక్ష్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగష్టు 5, ప్రభాతవార్త** నెల్లూరు కు చెందిన అల్లా బక్ష్ షేక్‌కు ఎలక్ట్రానిక్స్ కమ్యూని కేషన్ ఇంజనీరింగ్‌లో పిహెచ్‌డి డిగ్రీ అవార్డు అందుకున్నారు. "డీప్ లెర్నింగ్ బేస్డ్ ఆబ్జెక్ట్ డిటెక్షన్ అప్రోచ్స్ ఫర్ ఎన్హాన్సింగ్ అనామలి ఐడెంటిఫికేషన్ ఇన్ పాదచారుల మార్గాలు అనే థీసిస్‌ను విశ్వ విద్యాలయం పరీక్షకుల ప్యానెల్ సిఫార్సు మేరకు ఆమోదించింది ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఫ్యాకల్టీలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డుకు అర్హత పొందాడు. ఈ మేరకు అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ అల్లాబక్ష్ షేక్ ప్రకటించబడ్డాడు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కారించండి

**- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం**



**నెల్లూరు కలెక్టరేట్, ఆగష్టు 5, ప్రభాతవార్త** జిల్లాలో పెండింగులో వున్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కారించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. జర్నలిస్టుడేని పురస్కరించుకుని నెల్లూరు కలెక్టరేట్ లో కలెక్టర్ ఆనంద్‌కు పలు సమస్యల పై ఏపియుడబ్ల్యూజెనాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా వెంకటేవ్వర్లు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ నియమాల జీవో వెంటనే విడుదల చేయాలన్నారు. పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ వెంటనే అక్రెడిటేషన్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్ మస్తాన్ రెడ్డి, ఏ. జయప్రకాష్, రమేష్. హనుక్ దయాశంకర్, మాల్యాద్రి. తదితరులు పాల్గొన్నారు.

## పీ4 కార్యక్రమంలో భాగంగా పేదరిక నిర్మూలనకు ప్రణాళికలు సిద్దం

- స్వచ్ఛందంగా కూడా మార్గదర్శకులు ముందుకు రావడం అభినందనీయమం
- ఇప్పటి వరకు 1075 బంగారు కుటుంబాలను రిజిస్టర్ చేశాము
- అవగాహనతో మరి కొంత మంది మార్గదర్శులు ముందుకు రండి
- నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోష్ అనూష



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 5, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనల మేరకు రూపుదిద్దుకున్న విజన్ యాక్షన్ ప్లాన్ 2047లోని పీ4 కార్యక్రమాన్ని లక్ష్య సాధన వైపు నడిపిస్తున్నామని, నెల్లూరు ఆర్డీఓ ఎన్ఎస్ అ నూష వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు ఆర్డీఓ కార్యాల యాన్ని రూరల్ నియోజకవర్గంలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కేంద్రంగా ఆర్డీఓ అనూషను చైర్మన్‌గా ప్రభుత్వం ప్రకటించిన విష యం తెలిసిందే. పేదరిక నిర్మూలనకు రూరల్ నియోజకవర్గంలో పీ-4 కార్యక్రమం ద్వారా తన శాయశక్తుల కృషి చేస్తున్నానని ఆమె తెలిపారు. దీనిపై మంగళవారం ఆర్డీఓ అనూష వార్త ప్రతినిధితో తన కార్యాలయంలో ముఖాముఖి మాట్లాడారు.

**వార్త ప్రతినిధిః పీ-4 కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమేనా..?**

**ఆర్డీఓ అనూషః** తప్పకుండా సాధ్యమే, ఇందుకోసం తాము నియమించిన ప్రత్యేక టీమ్ నిరంతరం కృషి చేస్తోంది. వారికి తాను తగిన సలహాలు సూచనలు ఇచ్చి ముందుకు నడిపిస్తున్నాను. ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసి, అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం కృషి జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అందుకు అనుగుణంగా పని చేస్తున్నాను.

**వార్తప్రతినిధిః మీ పరిధిలో ఎన్ని బంగారు కుటుంబాలను గుర్తించారు..?**

**ఆర్డీఓ అనూషః** ఇప్పటి వరకు తమ పరిధిలో 13.198 బంగారు కుటుంబాలను గుర్తించాము. పేదరికం నుంచి వారిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. దశల వారీగా వీరి అభివృద్ధికి పాటుపడతాము.

**వార్త ప్రతినిధిః ప్రస్తుతం ఎన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకోబోతున్నారు..?**

**ఆర్డీఓ అనూషః** ప్రస్తుతం తమ పరిధిలో 1075 బంగారు కుటుంబాల దత్తత కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఒక యూనిట్ కేంద్ర పరిధిలో 5 వేల బంగారు కుటుం బాలను సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. అందుకు తగిన విధంగా కృషి చేస్తున్నాము.

**వార్త ప్రతినిధిః ఇప్పటి వరకు ఎంత మంది మార్గదర్శులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చారు.**

**ఆర్డీఓ అనూషః** ఇప్పటి వరకు 317 మంది మార్గదర్శులను ఎంపిక చేయడం జరిగింది. గౌరవ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సహకారంతో కాంట్రాక్టర్లు, రియల్టర్లను చైతన్యం చేసి ప్రస్తుతం నమోదైన 1075 బంగారు కుటుంబాలను వారి సారధ్యంలో అన్ని విధాల అభివృద్ధి చేయమని ఆదేశించాను. ఒక మార్గదర్శి 5 బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని, వారి కుటుంబాలలో పిల్లల చదువులు జీవనోపాధి, మహిళలకు ఉపాధి మార్గాలు తదితరాలను అన్వేషించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు సహాయ సహకారాలను అందిస్తారు. తద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుంది.

**వార్తప్రతినిధిః బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారా..?**

**ఆర్డీఓ అనూషః** అనేక మంది స్వచ్ఛందంగా కూడా మార్గదర్శులు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ పిలుపులో భాగంగా, తమ కృషి ఫలితంగా, తమంతట తాము, తన కార్యాలయానికి విచ్చేసి మాకు కొన్ని కుటుంబాలను కేటాయించమని కోరుతున్నారు. వారికి నా ప్రత్యేక ధన్యవాదాలు త్వరలోనే బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్న మార్గదర్శులను తమ కార్యాలయానికి ఆహ్వానించి శాలువాలతో సత్కరించి అభినందించబోతున్నట్లు ఆర్డీఓ అనూష తెలిపారు. ప్రభుత్వం 1:3 ప్రకారం మార్గదర్శులకు బంగారు కుటుంబాలను కేటాయించమని ఆదేశించింది. ఆ దిశగా కూడా ప్రయత్నాలు సాగుతున్నాయని ఆమె వెల్లడించారు. పేదలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దే లక్ష్యాలను తప్పక సాధిస్తాము.

